నూతన కలెక్టర్‌గా అద్వైత్ కుమార్‌సింగ్ బాధ్యతల స్వీకరణ

మహబూబాబాద్ రూరల్, జనవరి 5: జిల్లా నూతన కలెక్టర్‌గా అద్వైత్ కుమార్ సింగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు జిల్లా అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అదనపు కలెక్టర్ డేవిడ్, జడ్పీ సీఈవో రమాదేవి, డీఆర్డీవో పీడీ సన్యాసయ్య, అధికారులు అభినందనలు తెలిపారు.

జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్

ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలి

ప్రజా పాలన దరఖాస్తులను ఒకసారి పరిశీలించి పూర్తి అవగాహనతో ఆన్‌లైన్ చేయాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. దరఖాస్తులపై అనుమానాలుంటే వెంటనే అడిగి తెలుకోవాలన్నారు. ఆన్‌లైన్ చేసిన ప్రతి దరఖాస్తుకు నంబర్ వస్తుందని, దానిని దరఖాస్తుపై నమోదు చేయాలన్నారు. సెల్ నంబర్‌కు సైతం మెస్సేజ్ వచ్చేలా, దరఖాస్తు ఏ దశలో ఉందో తెలుకునేవిధంగా చూడాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో మార్పులు చేయరాదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, నియోజకవర్గస్థాయి స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

వివరాలను త్వరితగతిన అందించాలి

రోజువారీగా ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను త్వరిత గతిన అందించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రజాపాలన కార్యక్రమం అమలుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ప్రజా పాలన నిర్వహణ తీరు వేగవంతం చేయాలన్నారు. నివేదికలను సైతం త్వరగా చేపట్టాలన్నారు. ప్రతి దరఖాస్తును వేగంగా ఆన్‌లైన్ చేసే విధంగా ఎంపీడీవోలు బాధ్యతలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ డేవిడ్, నోడల్ అధికారులు సూర్యనారాయణ, సుధాకర్, ఆర్డీవో అలివేలు, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నారాణి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆరు గ్యారెంటీలు..

ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్, జనవరి 5: అర్హులైన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. శుక్రవారం నడివాడ, ఉత్తరతండా గ్రామాల్లో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం ప్రవేశ పెట్టిందని, అర్హులందరూ గ్రామ సభల ద్వారా అధికారులకు దరఖాస్తులు అందించాలన్నారు. వాటిని స్క్రూటినీ అనంతరం అర్హులను ఎంపిక చేస్తారన్నారు. సర్పంచులు ఆంగోత్ కాంతికిషన్‌నాయక్, నర్మద గుట్టయ్య, ఎంపీటీసీలు మంగీలాల్, శ్రీపాల్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ సూర్యనారాయణ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, సెక్రటరీ నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్ : దరఖాస్తులు తీసుకుంటున్న ఎమ్మెల్యే

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

నెల్లికుదురు: పార్టీలకతీతంగా అర్హులందరికీ ఆరు గ్యారెంటీలు అందాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన గ్రామసభలు నిర్వహిస్తూ దరఖాస్తులు స్వీకరిస్తున్నదని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ అన్నారు. మండలంలోని మెచరాజుపల్లి, కాచికల్, శ్రీరామగిరి గ్రామాల్లో శుక్రవారం ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులందరూ ప్రజా పాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తుల్లో ఎలాంటి సందేహాలున్నా మండల, జిల్లాస్థాయి అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ నెల 6 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, వైస్ ఎంపీపీ జెల్ల వెంకటేశ్, సర్పంచులు, ఎంపీటీసీలు, నియోజకవర్గ నోడల్ ఆఫీసర్ సూర్యనారాయణ, మండల ప్రత్యేకాధికారి పీ రామారావు, ప్రజా పాలన టీం లీడర్లు శేషాద్రి, రాజ, మండల ఏవో నెలకుర్తి రవీందర్‌రెడ్డి, ఎంపీవో పార్థసారథి, సభ్యులు పాల్గొన్నారు.

నెల్లికుదురు : దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం

గూడూరు: పేద, మధ్యతరగతి ప్రజలకోసం రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తుందని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. శుక్రవారం కొల్లాపురం, తీగలవేణి, బొల్లేపల్లి గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులకు పథకాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీలార్ అశోక్‌కుమార్, ఎంపీడీవో రోజా రాణి, సర్పంచులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

దంతాలపల్లి, జనవరి 5: ఇంటి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని దంతాలపల్లి పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బాలాజీ అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో ఇంటి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారంలో ఒకరోజు ఇంటి పరిసరాలు, నీటి ట్యాంకులను శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం కళావతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

చిన్నగూడూరు, జనవరి 5: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ కవిత చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. పిల్లలను విధిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సర్వర్‌బీ, బాలింతలు, గర్భిణులు ఉన్నారు.

రేపు విద్యా సదస్సు

మహబూబాబాద్ రూరల్, జనవరి 5: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7న జిల్లాలోని తొర్రూరులో విద్యా సదస్సు నిర్వహించనున్నట్లు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం తెలిపారు. శుక్రవారం పట్టణంలో విద్యా సదస్సు కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సదస్సుకు జస్టిస్ చంద్రకుమార్, ఉమ్మడి ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి మురళి, ప్రధాన వక్తలుగా పాల్గొంటారని, విద్యాభిమానులు, ఉద్యోగులు, కుల, ప్రజా సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్, రమేశ్, విద్యాసాగర్, గోవర్ధన్, శంకర్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి

తొర్రూరు, జనవరి 5: జాతీయస్థాయి హాకీ పోటీలకు తొర్రూరు మైనార్టీ గురుకుల విద్యార్థిని కే సంజన ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పీ వజన శుక్రవారం తెలిపారు. గత నెలలలో మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో జరిగిన అండర్-17 కేటగిరి హాకీ పోటీల్లో విద్యార్థిని సంజన పాల్గొని ప్రతిభ కనబర్చిందని, ఈనెల 5 నుంచి కర్ణాటకలోని కొడగులో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంజన, పీఈటీ ఎం ఉమను ప్రిన్సిపాల్, కో-ఆర్డినేటర్ శ్రీవిద్య, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కళాకారులకు ఉద్యోగం ఇవ్వాలి

డోర్నకల్, జనవరి 5: తెలంగాణ నిరుద్యోగ ఉద్యమ కళాకారులకు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని తెలంగాణ నిరుద్యోగ ఉద్యమ కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనుమోజు వెంకటేశం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జైన్ భవనంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కళాకారులు పగిడిపాల వెంకట్రావ్, ధనియాకుల రామారావు, వీరబోయిన ఉపేందర్, శ్రీను, రమేశ్ పాల్గొన్నారు.

ఒకరి ఆత్మహత్య ..

గార్ల, జనవరి 5: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గార్ల రైల్వే స్టేషన్ సమీపంలో డబ్బాల మోరీ వద్ద శుక్రవారం జరిగింది. జీఆర్‌పీ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గుంపెళ్లగూడెం గ్రామానికి చెందిన కళ్లెం రాజు (35) ఆర్థిక ఇబ్బందుల కారణంగా శుక్రవారం రైల్వేస్టేషన్ సమీపంలో డబ్బాల మోరీ వద్ద కృష్ణా ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామని, డిప్యూటీ ఎస్ఎస్ పంకజ్ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్సై తెలిపారు.

పురుగుల మందుతాగి..

నర్సింహులపేట: మనస్తాపంతో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కౌసల్యాదేవిపల్లి, గ్రామ శివారు రూప్లాతండాలో శుక్రవారం జరిగింది. ఎస్సై గండ్రాతి సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. రూప్లాతండాకు చెందిన తేజావత్ నరేశ్ (22) భార్య గర్భిణి. ప్రసవం కోసం చర్లచంద్రుతండాలోని తన తల్లి వద్దకు వెళ్తానని చెప్పగా భర్త నిరాకరించాడు. ఇక్కడే ఉండి డెలివరీ చేయించుకోవాలని కోరాడు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన నరేశ్ పురుగుల మందు తాగి మృతి చెందాడు. మృతుడి తండ్రి మాన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అయోధ్య రాముడి అక్షింతల ఊరేగింపు

కేసముద్రం, జనవరి 5: అయోధ్య రాముడి అక్షింతలు శుక్రవారం మండల కేంద్రానికి చేరగా భక్తులు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అర్చకులు వాటిని ఊరేగించారు. అమీనాపురంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు.

చిన్నగూడూరులో..

చిన్నగూడూరు: మండలంలోని జయ్యారం గ్రామంలో అయోధ్య రాముడి అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం గ్రామంలోని సీతారామచంద్ర స్వామి ఆలయానికి తరలించి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'మహిళా సాధికారత'కు విద్య ప్రధానం

మహబూబాబాద్ రూరల్, జనవరి 5: మహిళలు చదువు కోవడం ద్వారానే మహిళా సాధికారత సాధ్యమవుతుందని జెండర్ స్పెషలిస్ట్ కే అనిత అన్నారు. శుక్రవారం మండలంలోని అమనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కళ్లెం వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన 'బేటీ బచావో బేటీ పడావో' సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో లింగ వివక్ష పోవాలంటే బాలికలు చైతన్యం కావాలన్నారు. ఇంకా భ్రూణ హత్యలు జరుగుతున్నాయని, బాధితులు వెంటనే 1098కు ఫోన్ చేయాలన్నారు. బాల సంరక్షణ పథకంలో ప్రతి ఒక్కరూ సభ్యులుగా చేరాలన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు వెంకన్న, కవిత, బీ రమేశ్, జ్యోతి, జనార్దన్ పాల్గొన్నారు.

దోమతెరల పంపిణీ

గూడూరు, జనవరి 5: రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దోమతెరలు, దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమని తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీడీవో రోజారాణి అన్నారు. శుక్రవారం మండలంలోని ఊట్ల, దొరవారితిమ్మాపురం, కొంగరగిద్ద, మచ్చర్ల గ్రామాల్లో నిరుపేదలకు సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్లు, దోమతెరలను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సామాజిక సేవలు చేయడం, పేదలకు కార్యక్రమంలో వారి అవసరాలనుతీర్చడం సంతోషకరమన్నారు.

ఉపన్యాస పోటీలకు ఆహ్వానం

మహబూబాబాద్ రూరల్, జనవరి 5: నెహ్రూ యువకేంద్రం వరంగల్ ఆధ్వర్యంలో 'మై భారత్ విక్షిత్' అంశంపై ఈ నెల 9న పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నట్లు యువజన అధికారి అన్వేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 29 ఏళ్ల మధ్య ఉన్న జిల్లావాసులు మాత్రమే అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 7673 956173 సంప్రదించాలన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

దంతాలపల్లి, జనవరి 5: మండలంలోని వేములపల్లి గ్రామంలో నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ సందర్భంగా వేములపల్లి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల నైపుణ్యాలను వెలికి తీసేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగ పడుతాయన్నారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.20,016 షీల్డు, రెండో బహుమతి రూ. 10,016 షీల్డు, మ్యాన్ ఆఫ్‌ది సీరీస్ రూ. 2,016 షీల్డు, మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ రూ.1,016 షీల్డు, బెస్ట్ క్యాచ్ ఆఫ్‌ది టోర్నమెంట్ రూ.1,016షీల్డు, లాంగెస్ట్ సిక్స్ ఆఫ్‌ది టోర్నమెంట్ రూ. 1,016షీల్డును దాతల సమకారంతో అందజేస్తామన్నారు. ఎంట్రీ ఫీజు రూ.999 ఉంటుందన్నారు. అనంతరం క్రీడాకారులకు దాతలు నూకల శ్రవణ్‌కుమార్‌రెడ్డి, కుర్యావుల గణేశ్, ఆవుల సురేశ్, గుమ్మడవెల్లి పర్వయ్య, రాజేశ్, క్రికెట్ కిట్స్, టీషర్ట్స్ అందజేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.

'ప్రజా పాలన'ను వినియోగించుకోవాలి

- ప్రజాప్రతినిధులు, అధికారులు
- జిల్లాలో కొనసాగుతున్న గ్రామసభలు, దరఖాస్తుల స్వీకరణ

తొర్రూరు, జనవరి 5: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన 'అభయహస్తం' ఆరు గ్యారెంటీల పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని నాంచారి మడూరు, వెలికట్ట, వెంకటాపురం గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమాన్ని తహసీల్దార్ వినోద్ కుమార్‌తో కలిసి ఎంపీపీ, జడ్పీటీసీలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు మహాలక్ష్మి, గృహలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, చేయూత పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. పేదలకు వరం అభయహస్తం పథకాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందాలన్నారు. ప్రజాపాలన సభల్లో దరఖాస్తు ఇవ్వని వారు ఈ నెల 6 తర్వాత తహసీల్దార్ కార్యాలయాల్లో అందజేసి రసీదులు పొందాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేవిధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సింగారపు కుమార్, ఎస్సై జగదీశ్, ప్రత్యేకాధికారి శోభన్‌బాబు, ఎంపీవో గౌస్, సర్పంచులు గుంటుక యాదలక్ష్మి, పోసాని పుష్పలీల, శీలం లింగన్నగౌడ్, ఎంపీటీసీ కుంభం సుకన్యారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, కాంగ్రెస్ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కాందాడి అశోక్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పింగిలి ఉష, ఆర్ఐ రాహుల్, ఉపసర్పంచ్లు వెంకటేశ్వర్లు, యాకన్నగౌడ్, రవినాయక్, పంచాయతీ కార్యదర్శి ఉషారాణి, వార్డు సభ్యుడు దేవేందర్‌రాజు, నాయకులు డీ శ్రీనివాస్, ఈ శ్రీనివాస్, ఏ మహేశ్, ఎం లింగన్న గౌడ్, కే ప్రభు, సిబ్బంది పాల్గొన్నారు.

తొర్రూరు : దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపీపీ అంజయ్య, జడ్పీటీసీ శ్రీనివాస్, తహసీల్దార్

డోర్నకల్‌లో ముగిసిన గ్రామ సభలు

డోర్నకల్: మండలంలోని 26 జీపీల్లో ప్రజా పాలన గ్రామ సభలు శుక్రవారంతో ముగిశాయి. చివరిరోజు చాప్లతండా, అమ్మపాలెం జీపీల్లో దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఎంపీడీవో చలపతిరావు, తహసీల్దార్ నాగ భవాని, ఎంపీవో మున్వర్‌బేగ్, ఏవో మురళీకృష్ణ, ఏఈ అలీ, ఏపీఎం శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

జిల్లా ఆరోగ్యశాఖ అధికారి అంబరీష

తొర్రూరు, జనవరి 5: ఆరోగ్య సమస్యలతో వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అంబరీష అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంఏహెచ్‌పీలు, పల్లె దవాఖానల సిబ్బంది సమయపాలన పాటించడం లేదని ఫిర్యాదులు అందాయని, వీటిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి రోజూ రోగుల సేవలు, వివరాలు, మందుల వినియోగం, జాతీయ ఆరోగ్య కార్యక్రమా లు, రోజువారీ హాజరు వివరాలు, సమయపాలన తదితర విషయాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో గుండాల మురళీధర్, వైద్యులు మీరాజ్, జ్వలిత, ప్రియాంక, నందన, నర్సింగ్ ఆఫీసర్, సిబ్బంది, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానలో మెరుగైన సేవలు..

నర్సింహులపేట: ప్రభుత్వ దవాఖానలో ప్రసూతి సంఖ్య పెంచేలా వైద్య సిబ్బంది గర్భిణులకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో అంబరీష అన్నారు. శుక్రవారం మండలంలోని కౌసల్యదేవిపల్లిలోని హెల్త్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలోని గర్భిణుల ఇండ్లకు వెళ్లి ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన సేవలను వివరించారు. ఉచితంగా ప్రసూతి చేయడంతోపాటు ఇంటి నుంచి వాహనంలో తీసుకెళ్లి తల్లీబిడ్డను ఇంటికి చేర్చుతున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా దవాఖానలో ఎలాంటి ఖర్చులు లేకుండా అన్ని మందులు అందిస్తారన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ అంజలి, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, అశ కార్యకర్తలు ఉన్నారు.

తొర్రూరు: పీహెచ్‌సీలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో అంబరీష

వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలి..

దంతాలపల్లి : వైద్యాధికారులు, సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించాలని జిల్లా వైద్యాధికారి అంబరీష అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్లను పరిశీలించి రోగులకు అందించే సేవలు, సౌకర్యాల ను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను వందశాతం పూర్తి చేయాలని ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

విద్యా సదస్సును విజయవంతం చేయాలి

నర్సింహులపేట, జనవరి 5: టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 7న నిర్వహించనున్న విద్యా సదస్సును విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచింత విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సంఘం డైరీ, కాల్యెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తొర్రూరులోని ఎల్‌వీఆర్ గార్డెన్‌లో 'రాజ్యాంగ విలువలు-భారత రాజకీయాలు' అంశంపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, 'భారత విద్యారంగం, సమాజ అవసరాలు, పాలకుల విధానాలు'పై ఆకునూరి మురళి వివరిస్తారన్నారు. సదస్సుకు ఉపాధ్యాయులు, విద్యాభిమానులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో టీపీటీఎఫ్ బాధ్యులు క్రాంతికుమార్, వెంకట్రాం నర్సయ్య, రమేశ్, భిక్షం, యాకన్న, శేఖర్, మహేందర్‌రెడ్డి, రాజు బాలాజీ, లాల్‌చంద్, నెహ్రూ, పద్మావతి, సుజాత, జనిత, శ్వేత పాల్గొన్నారు.

క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందజేత

దంతాలపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యతను వెలికి తీసేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. దీంతోపాటు క్రీడాకారులకు కావాల్సిన క్రికెట్ కిట్లు, వాలీబాల్ కిట్లను పంపిణీ చేయగా, శుక్రవారం మండలంలోని దొనకొండలో క్రీడాకారులకు సర్పంచ్ చొప్పర ఉప్పలయ్య క్రికెట్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో మాల్సూర్, లింగన్న, సురేశ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఆందోళన చెందవద్దు

నెల్లికుదురు, జనవరి 5: ప్రభుత్వ ఉపాధ్యాయుల పదోన్నతులకు టెట్ తప్పనిసరని హైకోర్టు ఆదేశించడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వంతో పీఆర్టీయూ సంఘం తరపున చర్చలు జరిపి, వెసులుబాటు కల్పించి న్యాయం చేస్తానని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీశ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు యుగేంధర్‌రెడ్డి, సంఘం జిల్లా నాయకులు లక్ష్మణ్, సాయిలు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి

10/10 జీపీఏ లక్ష్యంగా విద్యార్థులకు బోధించాలి

జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు

నెల్లికుదురు, జనవరి 5: పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు 10/10 జీపీఏ సాధించేలా ఉపాధ్యాయులు బోధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పీ రామారావు అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నముప్పారం జిల్లా పరిషత్, మదనతుర్తి ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. చిన్నముప్పారం ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. గతేడాది పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతను సాధించడంపై ఉపాధ్యాయులను అభినందించారు. ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తి కొనసాగించాలని సూచించారు. గెస్ట్ ఉపాధ్యాయులతో పాఠ్యాంశాలు బోధిస్తే విద్యార్థుల్లో ఆసక్తి కలిగి సత్ఫలితాలు వస్తాయన్నారు. ఉపాధ్యాయులందరూ ఏకకాలంలో సీఎల్స్ పెట్టొద్దని, ముందస్తు సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు కావద్దని సూచించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నిత్యం తమ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలననను పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీజీఈ మందుల శ్రీరాములు, ఆలేరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రాందాస్, పాఠశాలల హెచ్‌ఎంలు రమేశ్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధనతుర్తి పాఠశాలలో ప్రార్థనలో పాల్గొన్న డీఈవో రామారావు

9న డోర్నకల్ మండల సభ

డోర్నకల్, జనవరి 5: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 9న ఉదయం 10.30గంటలకు ఎంపీపీ ధరంసోత్ బాలూనాయక్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చలపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో తమ నివేదికలతో హాజరు కావాలన్నారు.

లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో సైన్స్ ఫెయిర్

తొర్రూరు, జనవరి 5: మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో శుక్రవారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ ద్వారా నిర్వహిస్తున్న అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఏటీఎల్)లో మూడు రోజుల పాటు విద్యార్థులు మెంటర్ ఆధ్వర్యంలో ప్రయోగాలు నిర్వహించి నూతన ఆవిష్కరణలు కొనుగొని ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏఐఎం నెలకొల్పిన అటల్ టింకరింగ్ ల్యాబ్ విద్యార్థులకు ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో మెంటర్ పుంజిత్, సైన్స్ ఉపాధ్యాయులు భాస్కర్, నాగేశ్వర్‌రావు, ఓంప్రకాశ్, శ్రీనివాస్, వెంకటేశ్, మురళీకృష్ణ, పండరినాథ్, యాకూబ్, సైదులు, శ్రీహరి, నాగలక్ష్మి, లింగయ్య, దిలీప్, రాజు, రవి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ చోరీ..

డోర్నకల్, జనవరి 5: ట్రాక్టర్ చోరీ జరిగిన ఘటన గురువారం రాత్రి డోర్నకల్‌లో జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన దాసరి శ్రీను తన ట్రాక్టర్‌ను వీరహనుమాన్ ఫిల్లింగ్ స్టేషన్ (పెట్రోల్ బంక్) వద్ద నిలిపాడు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌ను చోరీ చేశారని, బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అడవిలో తప్పిపోయిన మహిళలు

కాపాడిన పోలీసులు

గణపురం, జనవరి 5: మైలారం అటవీ ప్రాంతంలో తప్పిపోయిన ఇద్దరు మహిళలను శుక్రవారం పోలీసులు కాపాడారు. ఎస్సై మచ్చ సాంబమూర్తి కథనం ప్రకారం.. గ్రామంలో జరిగిన శుభకార్యానికి కేసముద్రం మండలం ఇనుగుర్తి గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని కొనుకటి వెంకటమ్మ, కొనుకటి మంజుల రెండు రోజుల క్రితం వచ్చారు. శుక్రవారం బహిర్భూమికని అడవిలోకి వెళ్లి దారి తప్పారు. వారు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించినా జాడ దొరక్కపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై సాంబమూర్తి సిబ్బందితో కలిసి డ్రోన్ కెమెరా సాయంతో అడవిలో గాలించిగా గాంధీనగర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్నట్లు తెలుసుకొని క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★I, KANDIMALLA MADHAVI LATHA (Old Name), W/O. KANDIMALLA SUBAS CHANDRA, H.No. 16-7-280/193, Ramky Enclave, AJ Mills Colony, Laxmipuram, Warangal Dist.- 506002, T.S., Hereby I declare that, I have Changed my name to MADHAVI LATHA PINNELLI (New Name). NTW-0336

CHANGE OF NAME
I, GODISHALA SURAMMA, W/o. Late GODISHALA SAMBAIAH (Old Name), R/o H.No. 2-9-342, Sneha Nagar, Hanamkonda Mandal, Hanumakonda Dist., T.S., I have changed my name as GODISHALA SUJATHA (New name) for all future purposes.

LEASE/ RENT

★SVSL ARCADE for Corporate IT-Banks, Retail, Co-Working, Super Markets, Show Rooms etc., 10725 Sq.Fts built-up Buildings, Near: EPF Office, New Darga, NIT Road, Wgl. Cell: 8463900555, 9849197838. NTW-323112

డాక్యుమెంట్ పోయినది
తేదీ: 25-03-2023 రోజున హన్మకొండ చౌరస్తా నుండి రాయపురం ఆటోలో వెళ్తుండగా ఒరిజినల్ రిజిస్ట్రార్ ప్లాటు డాక్యుమెంట్ నెం. 8344/2013 సర్వే నెం. 142, శ్రీ కంచర్ల కరుణకర్, తండ్రి: కంచర్ల కుమారస్వామికి చెందిన 200 గజల స్థలం ఒరిజినల్ డాక్యుమెంటు పోయినవి. దొరికినవారు సంప్ర:
8309064880

VEHICLES FOR SALE
★TS03UB-1115 Gopu Sammi Reddy AL PSV BUS 2015 Auction Date: 06-01-2024, Place: Shriram Auto Mall, Indian Ltd. Warangal. Cont: SHRIRAM FINANCE LIMITED, H.No. 15-1-237, 2nd Floor, Opp: LB College, Mulugu Road, Cell: 9849981545, 9966196881. NTW-13449

WANTED
jobs Apply Now!
★ICICI, HDFC, Axis, Indusland Banks Personal Loans & Credit Cards for Sales. Exp. & Freshers, Female Tele Callers కావలెను. Salary+Inc., Job Location: HNK. Cont: 8886188690, 9393113929. NTW-5683

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9640400073/9160900024. NT-319407

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552

HANAMKONDA	WARANAGAL
9182777563	9182777556
9182777618	9182777557
9182777213	9182777558

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565